
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 49 | సోమవారం 6 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-



# సీమ అభివృద్ధికి రూ.30 వేల కోట్లు

- నీరు ఉంటే... సంపద ఉన్నట్లే
- జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్
- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
- జై అమరావతి.. చట్టబద్ధతపై ప్రజల హర్షాతిరేకాలు
- పిచ్చి ముదిరి జగన్ మావిగన్ మాటలు
- యాడికి 'జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# ఏపీకి అదనంగా చేరిన 1.90 లక్షల డోసుల హెచ్‌పీవీ టీకా

- 3.45 లక్షల్లో ఇప్పటికే 33.19% మంది బాలికలకు వ్యాక్సిన్ పంపిణీ
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**(అంకుశం, మంగళగిరి, ఏప్రిల్ 6):**
కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మరో 1,90,890 డోసుల హె చ్ పీ వీ వ్యాక్సిన్ ను పంపించింది. గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్ క్యాన్సర్) బారి నుంచి తప్పించేందుకు 14--15 ఏళ్ల బాలికల కోసం కేంద్రం తొలివిడత కింద గత నెలలో 1,90,800 డోసుల వ్యాక్సిన్ ను పంపింది. ఇందు కు అదనంగా మరో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ వ్యాక్సిన్ ను సదరు జిల్లాల్లోని బాలికల సంఖ్యకు అనుగుణంగా పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. వచ్చే మే నెల వరకు బాలికలకు నిరాటకంగా వ్యాక్సిన్ పంపిణీ జరుగుతుంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసినందున వ్యాక్సిన్ పంపిణీలో మరింత వేగం పెరుగుతుంది. గ్రామ/వార్డు సచివాలయాల్లో రికార్డుల ఆధారంగా 14 ఏళ్లు పూర్తి చేసుకుని 15 ఏళ్లు దాటని బాలికలు రాష్ట్ర వ్యాప్తంగా 3.45 లక్షల మంది ఉన్నారు. వీరిలో సోమవారం మధ్యాహ్నం వరకు 1,14,512 (33.19%) మంది బాలికలకు వ్యాక్సిన్ ఇచ్చారు. అత్యధికంగా కర్నూలు జిల్లా--6,785, నెల్లూరు జిల్లాలో 6,726, వైఎస్సార్--6,725, అనంతపురం జిల్లాలో 6,655 మంది బాలికలకు చొప్పున వ్యాక్సిన్ - మిగతా2లో

# పేలుడు ఘటనలో గాయడ్డ పోలీసులకు హోం మంత్రి పరామర్శ

## పోలీసులకు ధైర్యం చెప్పిన మంత్రి వంగలపూడి అనిత

**(అంకుశం, మంగళగిరి, ఏప్రిల్ 6):**
కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన పేలుడు ఘటనలో గాయపడిన పోలీసులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం పరామర్శించారు. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని ఆమె పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయాలైన పోలీసులకు ధైర్యం చెప్పిన మంత్రి, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, చల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతులు లేకుండా క్రాకర్స్ విక్రయిస్తున్న దుకాణాల నుంచి సీజ్ చేసిన పేలుడు పదార్థాలను కోర్టుకు తరలిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పేలుడు సంభవించిందని చెప్పారు. ఈ ఘటనలో ఎస్సై, కోర్ట్ కానిస్టేబుల్ మరియు - మిగతా2లో






# సోమవారంలోపే 60లక్షల క్లెయిమ్‌ల పరిష్కారం

- బంగాల్ ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు విచారణ
- అభ్యంతరాల పరిష్కారంపై సంతృప్తి వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం
- రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బలగాలను ఉపసంహరించేది లేదు

# చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

- "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది
- స్వదేశీ ప్రజలను ముప్పులోకి నెట్టే ప్రయత్నం: మోదీ
- 'మహిళా రిజర్వేషన్ చట్టం వల్ల రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఎలాంటి ధోకా ఉండదు'
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



# సీమ అభివృద్ధికి రూ.30 వేల కోట్లు

**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 6):**

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు పాస్ కావడంతో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్న బహిరంగ సభలో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'జలధార..నీటి భద్రత--సాగు నీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమంలో పాల్గొని 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అనంతపురం జిల్లా యాడికిలో విడుదల చేశారు. అనంతరం నీటి భద్రత--సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో రూపొందించిన యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా నీటి భద్రత కోసమే పనిచేస్తున్నాం. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని నిల్వ చేయాలి..నిలబడిన నీటిని జలాశయంలో చేసేందుకు ప్రయత్నించాలి. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం లాంటి అనేక ప్రయత్నాలు చేసి ముందుకు వెళ్లాం. పంట కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాలకు వేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా ట్రెంచ్‌లు, నీరు చెట్టు, నీరు--మీరు, నీరు--ప్రగతి లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం. అనంతపురం లాంటి ప్రాంతాల్లో కొన్ని ఏళ్లపాటు నీరే లేదు. నష్ట పోతున్న రైతులను ఆదుకోడానికి ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చింది కూడా టీడీపీనే. అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ కార్యక్రమం తీసుకువచ్చాం. 90 శాతం మేర సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇచ్చింది కూడా గతంలో మేమే. మైక్రో ఇరిగేషన్‌పై గతంలో ఇచ్చిన నివేదికే ప్రామాణికంగా మారి దేశంలో అంతా వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలో నెంబర్ వన్‌గా ఉన్నాం. డ్రిప్ ఇరిగేషన్ వల్లే రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. హార్చికల్చర్‌లో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాయలసీమ అభివద్ధికి ఒక ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన పూర్వోదయ పథకం ద్వారా రూ.30 వేల కోట్లు



వస్తాయన్నారు. 'పెట్టుబడులు ద్వారా మరో రూ.70 వేల కోట్ల రాబట్టి అభివద్ధి చేస్తాం. గడిచిన 21 నెలల్లో నీటి భద్రతా పరంగా చాలా మార్పులు వచ్చాయి. చెరువులు పెద్ద ఎత్తున నింపగలిగాం. జల సంరక్షణా చర్యల కారణంగా భూగర్భ జలాలను 1.92 మీటర్ల మేర అదనంగా పెంచగలిగాం. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్లుగా భూగర్భజలాలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే ఇప్పుడు 11 మీటర్లకే భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. చేపట్టిన భూసంరక్షణ చర్యల కారణంగా 2.2 మీటర్ల మేర జలాలు పెరగటం సంతోషం కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాల్లో దీనిని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి విజయం సాధించారు. ఈ ఉద్యమంలో ప్రజలందరికీ నేను తోడుగా ఉంటాను. జిల్లాలో 5.7 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. 20 వేలకుపైగా ఎండిన బోర్లలో నీరు అందుబాటులోకి వచ్చింది. ఒక్క జిల్లాలో రూ.96 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యింది. భూగర్భజలాలు పెరగటం మూలంగా హరిత ప్రాంతం పెరిగింది. ఇవన్నీ సానుకూలమైన అంశాలు' అని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకులు రాష్ట్ర ప్రజలకు అడ్రస్ లేకుండా చేశారని, పిచ్చి ముదిరి మావిగాన్ అంటూ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార కార్యక్రమంలో ప్రజావేదిక సభకు వచ్చేముందు ప్రజలు జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని అమరావతికి పార్లమెంట్






చట్టబద్ధత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్వయంగా అమరావతి లోగో పట్టుకుని సభకు జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. యాడికిలో సీఎం హెలిక్యాప్టర్ దిగాక అమరావతి బ్యాడ్జిని అందించారు. సభలో రాజధానికి చట్టబద్ధతపై హర్షం వ్యక్తం చేస్తూ ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు. సభ అనంతరం పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఆమోదానికి గుర్తుగా సీఎంకు అమరావతి జ్ఞాపికను జేసీ పవన్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, జెసి ప్రభాకర్ రెడ్డి మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి జెసి పవన్ రెడ్డి విప్ కాలువ శ్రీనివాసులు పరిటాల సునీత ఎమ్మెస్ రాజు బండారు శ్రావణి పల్లె సింధూర రెడ్డి ఎంపీలు పార్థసారథి అంబికా లక్ష్మీనారాయణ సురేంద్రబాబు దగ్గుబాటి ప్రసాద్ మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ జిల్లా ఎస్పీ పి జగదీష్ ఎంపీలు, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చొరబాటుదారులను బాధితులుగా చూపిస్తున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం విమర్శల వర్షం గుప్పించారు. అసోంలో చొరబాటుదారులకు కాంగ్రెస్ మద్దతు ఇస్తోందని, అక్రమ భూఆక్రమణలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అడ్డుకుంటోందని ఆరోపించారు. బార్పేటలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించిన ఆయన, చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణించే చట్టాలను తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, దీని ద్వారా స్వదేశీ ప్రజలు ప్రమాదంలో పడుతుందని మోదీ పేర్కొన్నారు. "బీజేపీ అసోంలోని అక్రమ భూఆక్రమణలను అరికట్టాలని చూస్తోంది. కానీ కాంగ్రెస్ బహిరంగంగానే చొరబాటుదారులకు మద్దతు ఇస్తోంది. పైగా అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్టవేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తోంది. అసోంలో కాంగ్రెస్ ఎలాంటి చట్టాన్ని తీసుకురావాలని అనుకుంటోందంటే, ఎవరైనా చొరబాటుదారుడు అనే పదాన్ని ఉపయోగిస్తే, వారు జైలుకు వెళ్లే పరిస్థితి వస్తుంది. కాంగ్రెస్? పార్టీ చట్టంలోనే చొరబాటుదారులను 'బాధితులు'గా పరిగణిస్తుంది. దీని వల్ల మెజారిటీ స్వదేశీ ప్రజలు జైలు శిక్ష ముప్పును ఎదుర్కోవాల్సి వస్తుంది." 'శ్రీమంత శంకరదేవ, మాధవదేవ, దామోదరదేవ, హరిదేవ్ మొదలైన వైష్ణవ సాధువుల పవిత్ర మఠాలకు చెందిన వేల బిగాల భూమి బార్పేటలో ఉంది. ఆ భూమిని చొరబాటుదారులు ఆక్రమించుకునేందుకు కాంగ్రెస్ అనుమతించింది. దీనితో చాలా భూభాగం అక్రమ ఆక్రమణలకు గురైంది' అని మోదీ ఆరోపించారు.

**కాంగ్రెస్‌కు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం!**

అసోం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని నొక్కి చెబుతూ, బోడో సామాజిక వర్గానికి చెందిన 'హుదుమ్ పూజ', కోచ్?-రాజ్?బోంగ్షి వర్గానికి చెందిన 'బాతౌ' అనేవి అసోం సంస్కృతి,



ప్రకృతి, విశ్వాసాల మధ్య ఉన్న సామరస్యానికి ఉదాహరణలుగా ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం రాష్ట్ర ప్రయోజనాల కంటే, రాజకీయ అధికారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, అందువల్ల అసోం సంప్రదాయాలకు గొప్ప నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు.

**మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం!**

మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దీనిపై కూడా మోదీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వల్ల ఏ రాష్ట్ర ప్రాతినిధ్యానికీ భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో అమలులో ఉన్న జనాభా నియంత్రణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

"ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో మేము చర్చించాం. దేశంలోని సోదరీమణుల, కుమార్తెల హక్కులకు సంబంధించిన ఈ పనిని ఏకగ్రీవంగా ముందుకు తీసుకెళ్లాలని మేము అందరినీ కోరాం. అయితే కొందరు వ్యక్తులు ఈ గొప్ప కార్యంపై గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి దేశంలోని అన్ని రాష్ట్రాలు దీనివల్ల ప్రయోజనం పొందుతాయి. దీని వల్ల ఏ రాష్ట్రానికి నష్టం వాటిల్లదు. జనాభా నియంత్రణ ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు కావచ్చు లేదా దక్షిణాది రాష్ట్రాలు కావచ్చు. వారి ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గదు. మహిళల కోసం అదనపు సీట్లు కేటాయించేలా మేము ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే ప్రస్తుతం ఉన్న సీట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. అందుకే, ఈ చట్టాన్ని అందరూ కలిగి ఆమోదించేలా రాజకీయ పార్టీల నేతలపై ఒత్తిడి తీసుకురావాలని నేను ప్రత్యేకంగా అసోం సోదరీమణులను కోరుతున్నాను."

**డీలిమిటేషన్?**

దేశంలోని నియోజకవర్గాల పునర్విభజన కోసం 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా నిర్ణయించారు. దీనికి అనుగుణంగా డీలిమిటేషన్ చట్టాన్ని సవరించనున్నారు. ఈ చట్టాన్ని ఆమోదించడానికి 2/3వ వంతు మెజారిటీ అవసరం. అందుకే ప్రతిపక్ష పార్టీల మద్దతు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఏప్రిల్? 16 నుంచి జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే దీనిపై చర్చించనున్నారు.

# 'సీఎం దేవుడేమీ కాదు!

ప్రధాని నరేంద్ర మోదీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్? ఇద్దరూ 'అహంకారులు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. వాళ్లిద్దరూ ప్రజలతో కలిసి పనిచేయడం కంటే, వారిపై పాలన సాగించాలనే మనస్తత్వం కలిగినవారని ఆయన ఆరోపించారు. కేరళలోని త్రిస్సూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన రాహుల్? గాంధీ, కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, అధికార ఎల్?డీఎఫ్? మధ్యే ఉంటుందన్నారు. అయితే ఎల్‌డీఎఫ్‌కు బీజేపీ లోపాయికారంగా సహకరిస్తోందని విమర్శించారు. "ఎల్‌డీఎఫ్‌కు ఒక అదృశ్యహస్తం సహాయం చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం నిజమైన వామపక్షంలా పరిపాలన చేయడం లేదు. దీన్ని అధికార సీపీఎం కార్యకర్తలు కూడా అంగీకరిస్తారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా చూసుకుంటే బీజేపీ తన ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్? అని భావిస్తోంది. కేరళలో అయితే కాంగ్రెస్? నేతృత్వంలోని యూడీఎఫ్?ను ప్రధాన ప్రత్యర్థిగా చూస్తోంది. దీనికి నిదర్శనం ఏమిటంటే, ప్రధాని మోదీ ఇతర చోట్ల తన ప్రసంగాల్లో దేవుడు, దేవాలయాలు, మతం గురించి మాట్లాడతారు. కానీ కేరళలో సీపీఎం నాయకులతో సంబంధం ఉన్న శబరిమల బంగారం మాయమైన అంశంపై మాత్రం మాట్లాడరు. ఎందుకంటే కేరళ ముఖ్యమంత్రిని, సీపీఎంను రక్షించాలని ఆయన కోరుకుంటున్నారు. ఎల్?డీఎఫ్?ను కాపాడడం కోసం ఆయన కేరళలో దేవుడిని, హిందూత్వాన్ని, దేవాలయాలను మర్చిపోయారు."



**నన్ను టార్గెట్ చేశారు!**

ప్రతిపక్ష నేతల విషయంలో బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ ఇష్టారీతిన ఉపయోగించుకుంటున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు. "నేను వారిని విమర్శిస్తున్నాను కాబట్టి నా ప్రభుత్వ నివాసాన్ని, నా పార్లమెంట్ సభ్యత్వాన్ని లాగేసుకున్నారు. నాపై కేసులు పెట్టి, విచారణ చేశారు. కానీ కేరళ ముఖ్యమంత్రిని, ఆయన కుటుంబాన్ని మాత్రం తాకడం లేదు. ఆయనపై ఈడీ, సీబీఐ చర్యలు లేవు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'మేము ఇక్కడ ఒక పార్టనర్‌షిప్‌నకు (బీజేపీ, ఎల్‌డీఎఫ్) వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు స్పష్టమవుతోంది. మణిపుర్‌లో మంటలు పెట్టినవారు, ఛత్తీస్‌గఢ్‌లో నర్సులపై దాడి చేసినవారు, మత ప్రాతిపదికను భారతదేశాన్ని విభజించి ద్వేషాన్ని, హింసను వ్యాప్తి చేస్తున్నవారే ఆ భాగస్వాములు' అని రాహుల్ గాంధీ అన్నారు.

**సీఎం దేవుడేమీ కాదు!**

విజయన్ చిత్రంతో ఉన్న 'హూ ఎల్స్' (ఇంకెవ్వరు) అనే నినాదం ఉన్న ఎల్?డీఎఫ్? ప్రచార బోర్డులపై కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు.? 'కేరళను పాలించడానికి ముఖ్యమంత్రి దేవుడు ఏమీ కాదు. రాష్ట్రంలో అపారమైన మేధస్సు, సామర్థ్యం ఉన్న మహిళలు, ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు' అని పేర్కొన్నారు. హూ ఎల్స్? అనే నినాదం రాష్ట్ర ప్రజలను కించపరచడమేనని, అది అహంకారానికి పరాకాష్టగా అభివర్ణించారు. 'మేము పోరాడుతున్నది సరిగ్గా ఇలాంటి అహంకార పూరిత మనస్తత్వంతోనే. మోదీ, అమిత్? షా, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మలది కూడా ఇదే మనస్తత్వం. తాము ప్రజలను పాలించడానికే ఇక్కడ ఉన్నామనే భావన వాళ్లది. అయితే తాము మాత్రమే పాలించగలమని చెప్పుకోవడానికి ఇది మహారాజుల కాలం కాదు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**బీజేపీతో సీపీఎం డీల్**

మరోవైపు, కేరళలో ఏప్రిల్ 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం సీపీఎం నేతృత్వంలోని కూటమితో బీజేపీ డీల్ కుదుర్చుకుందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ఆరోపించారు. 10 ఏళ్లపాటు అధికారంలో కొనసాగడం కోసం అధికార ఎల్‌డీఎఫ్ తన సిద్ధాంతాలు, జవాబుదారీతనం, బాధ్యతల విషయంలో పూర్తిగా రాజీపడిందని ఆమె విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తర కేరళ జిల్లాలోని పెరవూర్?లో జరిగిన ఓ మీటింగ్?లో వయనాడ్ ఎంపీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

## ఏపీకి అదనంగా చేరిన 1.90 లక్షల డోసుల హెచ్‌పీవీ టీకా

-మొదటిపేజీ తరువాయి

పంపిణీ జరిగింది తక్కువగా పోలవరం జిల్లా--669, అల్లూరి సీతారామరాజు--1,063, శ్రీ సత్యసాయి--2,769, అనకాపల్లి జిల్లాలో 2,959 మందికి చొప్పున వ్యాక్సిన్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ వాక్సిన్ పంపిణీ నిరాటకంగా కొనసాగుతోంది. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం ఉన్నట్లు గుర్తించిన ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రా(1,645)ల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎటువంటి రియాక్షన్ కేసెస్ నమోదు కాలేదని అధికారులు తెలిపారు. కేంద్ర మార్గదర్శకాలు అనుసరించి బాలికలకు వ్యాక్సిన్ పంపిణీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉంది. గర్భాశయ ముఖ క్యాన్సర్ను నివారించడంలో హెచ్?పవ వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తోంది ఈ హెచ్పీవీ టీకా సురక్షితమైనది. ప్రభావవంతమైంది. రెండు విడతలుగా కలిపి రాష్ట్రానికి కేంద్రం నుంచి 3,81,780 డోసుల టీకా వచ్చింది. మరోవైపు..కేంద్రానుంచి వచ్చిన ఆదేశాల మేరకు తొలి విడతలో వచ్చిన వాక్సిన్ లో 500 డోసులను యానాంకు పంపించారు.

## పేలుడు ఘటనలో గాయడ్డ పోలీసులకు హోం మంత్రి పరామర్శ

-మొదటిపేజీ తరువాయి

ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడినట్లు వివరించారు. అబ్దుల్లా అనే కానిస్టేబుల్‌కు 50--60 శాతం గాయాలున్నాయని, మిగతా వారికి ప్రాణాపాయం లేదని మంత్రి తెలిపారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని కష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. గాయపడిన పోలీసులందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన మంత్రి, వారి కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. అత్యుత్తమ వైద్యం అందిస్తున్న ఎన్ఆర్ఐ హాస్పిటల్ వైద్య బందానికి ఆమె ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు.

## పాకిస్థాన్ బెదిరింపులపైనా మోదీ స్పందించలేదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి విరుచుకుపడ్డారు. కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని పాకిస్థాన్ రక్షణ మంత్రి హెచ్చరిస్తుంటే, మోదీ మౌనం వహించడం దారుణమన్నారు. బంగాల్ ఎన్నికల పర్యటనలో ఆయన ఆ విషయం గురించి ఎందుకు ప్రస్తావించలేదని మండిపడ్డారు. ఆయన బంగాల్ లో జరిగే ఎన్నికలను పట్టించుకుంటారు కానీ, పాక్ బెదిరింపులకు పాల్పడినా ఒక్క మాట కూడా మాట్లాడరని దుయ్యబట్టారు. దాయాది దేశం బెదిరింపులకు మౌనం వహించినం దుకు గానూ మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నాడియా జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన ప్రేలాపణలను బంగాల్‌లో సభలో ప్రధాని ఎందుకు ప్రస్తావించలేదు పాక్ కోల్‌కతాపై దాడి చేస్తామని చెప్పినప్పుడు, మేం కఠిన చర్యలు తీసుకుంటాం అని మోదీ ఎందుకు అనలేదు? దేశానికి వచ్చే ఏ బెదిరింపునైనా మనం ఎలాగైతే అంగీకరించమో, అలాగే కోల్‌కతాకు వచ్చే హెచ్చరికలను కూడా మేం చూస్తూ ఊరుకోం"

**మమతా బెనర్జీ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డ బీజేపీ**

మరోవైపు, బీజేపీని ఉద్దేశిస్తూ సీఎం మమత బెనర్జీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పహల్గాం తరహా దాడికి బీజేపీ బ్లూప్రింట్ సిద్ధం చేసిందా అని మమత ప్రశ్నించారు. మోదీ మౌనం వెనుక ఏదైనా బ్లూప్రింట్ ఉందా? ఎన్నికల ముందు మరో పహల్గాం దాడి జరగబోతోందా అని ప్రశ్నించారు. కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామంటే భారత పౌరులుగా తాము సహించమని మమత తెలిపారు. అయితే, మమతా బెనర్జీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఆమె ఇలాంటి బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తింది. పహల్గాం ఉగ్రదాడిని మమత బ్లూప్రింట్ అని పేర్కొనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేసింది.

**అసలేం జరిగింది**

భవిష్యత్తులో భారత్ ఏదైనా దాడులకు పాల్పడితే, కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని ఇటీవల పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. ప్రతిదాడులను ఆ ప్రాంతం వరకూ తీసుకెళ్తామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎక్కడైనా కొంతమంది మృతదేహాలను పడేసి, వారు ఉగ్రవాదులేనని నమ్మించేలా భారత్ బూటకపు ఆపరేషన్ రూపొందించినట్లు నివేదికలు ఉన్నాయంటూ ఆయన ప్రేలాపణలు చేశారు. అయితే, వాటికి కచ్చితమైన ఆధారాలు ఆయన చూపలేదు. ఇది జరగడానికి ముందు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగు దేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఇందుకుగానూ ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత చేపట్టిన వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లను ఆయన ఉదహరించారు.

**బంగాల్ ఎన్నికల సమరం**

ఇదిలా ఉండగా, అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో బంగాల్?లో రాజకీయాలు రోజురోజుకీ మరింత హీటెక్కుతున్నాయి. ప్రధాన పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఈ క్రమంలో నదియా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మమతా కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్, డీఎంకే మధ్య రహస్య ఒప్పందం ఉందని మమతా విమర్శించారు. బంగాల్‌కు చెందిన అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తమిళనాడుకు ఎన్నికల పరిశీలకులుగా పంపిం చారని ఆరోపించారు. అయితే, ఎన్నికల వేళ ఇతర రాష్ట్రాల్లో కొంతమంది అధికారులను బదిలీ చేస్తే, బంగాల్‌లో మాత్రం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేశారని దుయ్యబట్టారు. ఈ చర్యల వల్ల రాష్ట్ర అభివృద్ధి పనులు దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. అలాగే, బంగాల్‌లో కీలక స్థానాల్లో తమ అనుకూల అధికారులను నియమించి స్వేచ్ఛగా వ్యవహరించేలా ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఉద్దేశిస్తూ మమతా ఆరోపణలు చేశారు. మరోవైపు, ఏప్రిల్ 8న తాను భవానీపుర్ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మమతా ప్రకటించారు. అయితే, ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలను ఐక్యం చేసే దిశగా పనిచేస్తానని మమత తెలిపారు. కాగా, 294 అసెంబ్లీ స్థానాలకు గానూ బంగాల్?లో ఏప్రిల్? 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఫలితాలు విడుదల కానున్నాయి.

## సోమవారంలోపే 60లక్షల క్లెయిమ్‌ల పరిష్కారం

బంగాల్ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ జాబితా నుంచి తొలగించిన సుమారు 60 లక్షల మంది క్లెయిమ్?లు, అభ్యంతరాలను సోమవారం లోపే పరిష్కరించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బలగాలను ఉపసంహరించేది లేదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్? ఎం. పాంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, కోల్‌కతా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాసిన లేఖను ఉటంకిస్తూ, సోమవారం మధ్యాహ్నం నాటికి దాదాపు 60 లక్షల కేసుల్లో 59.15 లక్షల క్లెయిమ్‌లను జ్యుడీషియల్ అధికారులు పరిష్కరించారని పేర్కొంది. "గతంలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, బంగాల్ నుంచి కేంద్ర బలగాలను ప్రస్తుతానికి ఉపసంహరించుకోవడం జరగదు. ఒకవేళ రాష్ట్ర యంత్రాంగం విఫలమైతే, తరువాత ఏం చేయాలో మేం ఆలోచిస్తాం" అని సీజేఐ పేర్కొన్నారు. ఇటీవల జ్యుడీషియల్ అధికారులపై ఘెరావ్ చేసిన మాల్దా జిల్లాలో కూడా దాదాపు 8 లక్షల కేసులు పరిష్కారం అయ్యాయని సర్వోన్నత ధర్మాసనం గుర్తించింది. మరోవైపు ఈసీ తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు, మిగిలిన క్లెయిమ్‌లను ఈ రోజులోపే పూర్తి చేస్తామని, సోమవారం రాత్రికి అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని కోర్టుకు తెలిపారు. అయితే పెండింగ్?లో ఉన్న డిజిటల్ సంతకాల అప్‌లోడింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏప్రిల్ 7 వరకు గడువు కావాలని ఆయన అడగగా, అందుకు కోర్టు అనుమతించింది. మరోవైపు బంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తరఫున హాజరైన సీనియర్ అడ్వొకేట్ శ్యామ్ దివాన్?, ఓటర్ల తొలగింపు సవాళ్లను విచారణ చేయడానికి ఏర్పాటు చేసిన 19 అప్పీలేట్ ట్రిబ్యునళ్లు ఇంకా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ఈ ట్రిబ్యునళ్ల కోసం ఏకరీతి విధివిధానాలను

## పేరూరు కాలువకు భూములిచ్చిన

# రైతులకు పరిహారం ఇవ్వండి

- ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్
- యాడికిలో చంద్రబాబును కలిసి పలు అంశాలపై వినతి పత్రం అందజేత
- సోమరవాండ్లపల్లి రిజర్వాయర్, పంప్ స్టేషన్ల నిర్మాణంపై విజ్ఞప్తి
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసిన ఎమ్మెల్యే సునీత





**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 6:** పేరూరు ప్రాజెక్టుకు నీరందించేందుకు చేపట్టిన కాలువ నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరారు. జలధార – నీటి భద్రత కార్యక్రమంలో పాల్గొనడానికి యాడికికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. హెలిప్యాడ్ వద్ద సీఎంకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై వినతి పత్రం అందజేశారు. ఇందులో ప్రధానంగా పరిటాల రవీంద్ర అప్పర్ పెన్నార్ (పేరూరు) ఎత్తిపోతల నీటిపారుదల ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 30శాతం పనులు పూర్తైనట్టు వివరించారు. అయితే భూమి కోల్పోయిన వారికి పరిహారం చెల్లించకపోవడంతో పనులు గతంలో నిలిచిపోయాయన్నారు. ఇప్పుడు పనులు తిరిగి ప్రారంభమైనప్పటికీ, పరిహారం ఇంకా చెల్లించకపోవడంతో.. బాధిత రైతులు తమ పొలాల్లోకి ప్రవేశించకుండా అక్కడక్కడ అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై గతంలోనే అనేక సార్లు అభ్యర్థించామన్నారు. సుమారు 929 ఎకరాల భూమికి సంబంధించిన రూ.46.03 కోట్లు విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్టు ముందుకు సాగే విధంగా రైతులు సహకరించేలా పరిహారం సొమ్ము విడుదల చేయాలని కోరారు. అలాగే సుమారు 9వేల ఎకరాల ఆయకట్టును అభివృద్ధి చేసేందుకు 1.50 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సోమరవండ్లపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కూడా చేపట్టాలని కోరారు. అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు ప్రధాన కాలువపై వివిధ ప్రదేశాలలో 4 పంపింగ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేయగా.. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వీటిని పరిశీలించి తగిన ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారు....

గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసిన ఎమ్మెల్యే సునీత

జేఎన్టీయూ 15వ స్నాతకోత్సవానికి హాజరైన అబ్దుల్ నజీర్ ను ఎమ్మెల్యే పరిటాల సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. స్నాతకోత్సవం అనంతరం గవర్నర్ గారిని కలసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు జేఎన్టీయూ వీసీ, ఇతర అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పుట్టపర్తిలో గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం





**అంకుశం న్యూస్ పుట్టపర్తిఏప్రిల్ 06:** సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి ఎయిర్పోర్ట్ కు విచ్చేసినజేఎన్టీయూలో నిర్వహించే స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి పుట్టపర్తి విమానాశ్రయం కు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గారికి పుష్పా గుచ్ఛం తో స్వాగతం పలికినా బి సి సంక్షేమ మంత్రివర్యులు సవిత గారు , పరిశ్రమలు & వాణిజ్యం మరియు ఆహార ప్రాసెసింగ్ మంత్రి టి జి భరత్ గారు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ,,జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ , జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ ,జిల్లా ఎస్పి సతీష్ కుమార్ , ఆర్డీఓ సువర్ణ తధితరులు పాల్గొన్నారు ...

## పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని)



**అంకుశం న్యూస్ న్యూస్ విజయవాడ ఏప్రిల్ 6:** సౌర విప్లవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వన్ టౌన్ ఇస్లాంపేట బిఆర్పి రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఆక్సిజనీ ఇన్ఫ్రా సోలార్ సర్వీసెస్ కార్యాలయాన్ని సోమవారం ఎంపీ కేశినేని చిన్ని ప్రారంభించారు .

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ....సౌర శక్తితో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు ను ఉపయోగించుకోవడం వల్ల విద్యుత్ బిల్లుల నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. పెరుగుతున్న విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలనుకునే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ యోజన పథకానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రోత్సాహం అందిస్తుందన్నారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, ప్రతి ఒక్కరు పీఎం సూర్య ఘర్ యోజన పథకం ద్వారా లబ్ధి పొందాలని సూచించారు.

స్థానికంగా 'ఆక్సిజనీ ఇన్ఫ్రా సోలార్ సర్వీస్' ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లి'పి.ఎం. సూర్య ఘర్' లి పథకం కింద సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు భారీ ప్రయోజనాలను అందిస్తోందన్నారు. ఈ పథకం ద్వారా వినియోగదారులు గరిష్టంగా రూ. 78,000 వరకు సబ్సిడీ పొందే అవకాశం ఉందనీ, ఎటువంటి ముందస్తు చెల్లింపు లేకుండానే అన్ని జాతీయ బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. సోలార్ సిస్టమ్ ఏర్పాటు కోసం ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం అమలకు వెసులుబాటు కల్పించినట్లు ఎంపీ తెలిపారు. సౌర విప్లవంలో భాగస్వాములు కావాలనుకునే ప్రతి ఒక్కరూ పి యం సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానల్స్ ను ను ఏర్పాటు చేసుకోవచ్చు అన్నారు.

## నారా చంద్రబాబు నాయుడు కి ఘన స్వాగతం..







**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 6:** అనంతపురం జిల్లా, యాడికి మండలంలోని వేములపాడు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సోమవారం ఉదయం చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి రాష్ట్ర ఆర్థిక ఢ ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ మరియు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు జేసీ.అస్మిత్ రెడ్డి, గుమ్మనూరు జయరాం, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధురారెడ్డి, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ ఎం.కేశవరెడ్డి, అహుడా చైర్మన్ టిసి.వరుణ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు.

# పుష్కలంగా ఆహార నిల్వలు

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులేమీ లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరా లకు, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులకు సరిపడా గోధుమలు, బియ్యం నిల్వలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అనుపమ్ మిశ్రా వ్యాఖ్యానించారు. "దేశంలో ఆహార భద్రత పరిస్థితిని వినియోగదారుల వ్యవహారాల శాఖ నిశితంగా గమనిస్తోంది. ఆహార పదార్థాల ధరలను పర్యవేక్షిస్తున్నాం. అలాగే ఆహార పదార్థాల నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 528 కేంద్రాల నుంచి వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రతిరోజూ 40 రకాల వస్తువుల ధరలను పొందుతుంది. హోల్‌సేల్, రిటైల్ ధరలు మొబైల్ యాప్‌లో అప్డేట్ చేస్తున్నాం. ఇప్పటివరకు మేము గమనించిన వరకు నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులు లేవు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం వద్ద 28 లక్షల టన్నుల పప్పుధాన్యాల బఫర్ స్టాక్ ఉంది. ఉల్లిపాయలు, బంగాళదుంప, టమాటాల ఉత్పత్తి దాదాపు గతేడాది స్థాయిలోనే ఉంది." అని అనుపమ్ మిశ్రా పేర్కొన్నారు. 1955 నాటి నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం, వస్తువుల బ్లాక్ మార్కెటింగ్ లేదా నిల్వలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అనుపమ్ మిశ్రా వెల్లడించారు. ఈ విషయంపై తాము రాష్ట్ర ప్రభుత్వాల తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వల విషయంలో రాష్ట్రాలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపేందుకు ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుత బఫర్ నిబంధనల కంటే మూడు రెట్లు అధికంగా దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు ఉన్నాయని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి సి. శిఖ తెలిపారు. దేశంలో ప్రస్తుతం సుమారు 222 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు, దాదాపు 380 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీంతో మొత్తం ఆహార నిల్వలు సుమారు 602 లక్షల మెట్రిక్ టన్నులకు చేరాయని పేర్కొన్నారు.

## పుట్టపర్తిలో గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ఘన స్వాగతం




**అంకుశం న్యూస్ పుట్టపర్తిఏప్రిల్ 06:** సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి ఎయిర్పోర్ట్ కు విచ్చేసినజేఎన్టీయూలో నిర్వహించే స్నాతకోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి పుట్టపర్తి విమానాశ్రయం కు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గారికి పుష్పా గుచ్ఛం తో స్వాగతం పలికినా బి సి సంక్షేమ మంత్రివర్యులు సవిత గారు , పరిశ్రమలు ఢ వాణిజ్యం మరియు ఆహార ప్రాసెసింగ్ మంత్రి టి జి భరత్ గారు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ,,జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ , జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ ,జిల్లా ఎస్పి సతీష్ కుమార్ , ఆర్డీఓ సువర్ణ తధితరులు పాల్గొన్నారు ...

## చంద్రబాబు ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా ముగింపు

-- జిల్లా ఎస్పీ పి.జగదీష్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఏప్రిల్ 6:** అనంతపురం జిల్లా యాడికిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి పర్యటన ప్రశాంతంగా ముగిసింది. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం లోని యాడికి మండలంలోని వేములపాడు వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.యాడికి మార్కెట్ యార్డులో నిర్వహించిన సభాస్థలంలో విస్తృతంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేపట్టారు. పెండేకల్లు రిజర్వాయర్ ప్రాంతంలో కూడా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ పర్యవేక్షణలో పోలీసులు సమన్వయంతో పనిచేశారు. ప్రతి భద్రతా పాయింట్‌ను ఎస్పీ జగదీ ష్ స్వయంగా సమీక్షిస్తూ సిబ్బందిని అప్రమత్తంగా ఉండేలా మార్గనిర్దేశం చేశారు. మొత్తం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు విజయవంతంగా భద్రతా చర్యలు చేపట్టారు

## జలధారతోనే భూగర్భ జలాల పునరుజ్జీవం

-మండల ఇంచార్జి ధర్మవరపు మురళీ



**రాప్తాడు అంకుశం న్యూస్ ఏప్రిల్ 6:** జలధారతోనే భూగర్భ జలాల పునరుజ్జీవం సాధ్యమవుతుందని, చెరువుల సంరక్షణ సాగునీటి సంఘాల ప్రాథమిక బాధ్యత అని ఎమ్మెల్యే పరిటాల సునీత సోదరుడు, మండల ఇంచార్జి ధర్మవరపు మురళీ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎంపీడీఓ బి.విజయలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో రాప్తాడు చెరువు వద్ద జలధార – నీటి భద్రత' కార్యక్రమంలో భాగంగా పురోహితుడు వాసుదేవరావు గంగమ్మకు జలహారతి ఇచ్చి పూజలు చేశారు. మురళీ మాట్లాడుతూ వర్షపు నీటిని వృథా చేయకుండా చెరువుల్లో నిల్వ ఉంచుకోవడం ద్వారానే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. , ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార కార్యక్రమం ద్వారా సాగునీటి సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి చుక్కను భవిష్యత్ అవసరాల కోసం భద్రపరచుకోవాలని సూచించారు. అందరూ సమిష్టిగా నీటిని పొదుపుగా వాడుకుంటూ రాబోయే తరాలకు నీటి భద్రత కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు అశోక్ బాబు, అచ్యుత్ బాబు, ఏపీఓ సావిత్రి, ఈసీ మురళీ, మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనా, మూలింటి బీరన్న, రాప్తాడు, చాపట్ల, చెర్లోపల్లి, అయ్యవారిపల్లి సాగునీటి సంఘాల అధ్యక్షులు జూటూరు రామకృష్ణ, కుమార్, ఉమాపతి, తిరుపాలమ్మ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మీనారాయణ, తలారి శివ, వినోద్, ఉపాధ్యక్షుడు పెదమాదయ్య, సంఘం సభ్యులు మాదన్న, అంజనప్ప, వెంకటేశు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడు ప్రజల దశాబ్దాల కల త్వరలో సాకారం



**రాప్తాడు అంకుశం న్యూస్ ఏప్రిల్ 6:** నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత రాప్తాడు ప్రజల కోసం మరో ప్రతిష్టాత్మక అడుగు వేశారు. గత కొన్ని కొన్నేళ్లుగా వందలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, స్థానికులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న రాప్తాడు నుండి జేఎన్‌టీయూకి వెళ్లే మార్గాన్ని కొత్తగా నిర్మించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు పడుతున్న తీవ్ర ఇబ్బందులను గమనించిన టిడిపి మండల ఇన్చార్జి ధర్మవరపు మురళి యుద్ధ ప్రాతిపదికన కొత్త రోడ్డు నిర్మించాలని అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యటించి, పూర్తిగా గుంతలు పడిన రహదారిని పరిశీలించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ పి. విజయకుమారి, మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శ్రీనివాసులు. అధికారులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు, రహదారి నిర్మాణానికి ఉన్న సాంకేతిక ఇబ్బందులను త్వరగా తొలగించి పనులు ప్రారంభించాలని మురళీ అధికారులకు సూచించారు. ఈ కొత్త రహదారి అందుబాటులోకి వస్తే రాప్తాడు ప్రాంతం నుంచి అనంతపురం వెళ్లే విద్యార్థులకు, ఉద్యోగులకు రవాణా కష్టాలు తీరడమే కాకుండా, ఈ ప్రాంతం ఆర్థికంగా కూడా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా

# వైయస్ జగన్ ను ముఖ్యమంత్రి చేసుకోవడానికి కష్టపడదాం





- గ్రామ స్వరాజ్య సాధనకు మళ్లీ జగన్ నాయకత్వం అవసరం"
- సర్పంచుల అభినందన సభ
- మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 6 :**వైయస్ జగన్ ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవడానికి కార్యకర్తలు నాయకులు మాజీ గ్రామ నాయకులు అందరూ ఐకమత్యంతో కృషి చేయాలని పార్టీని అధికారంలో తీసుకురావడమే లక్ష్యంగా మనందరం కదరాలని మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ పిలుపునిచ్చారు తెలుగుదేశం పార్టీ అరాచకాలపై ఎప్పటికప్పుడు పోరాడాలని ప్రజల్లో అధికార పార్టీపై వ్యతిరేకత ఉందని ప్రజలను ఇంకా చైతన్యవంతులు చేస్తూ మనం కార్యక్రమాలు నిర్వహించాలని ఎప్పటికప్పుడు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని డాక్టర్ శైలజనాథ్ పిలుపునిచ్చారు. గ్రామాల్లో పార్టీ పటిష్టంగా ఉండాలంటే గ్రామస్థాయిలో నాయకులు విభేదాలు పక్కన పెట్టి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని మీరు చేసిన సేవలే రాబోవు రోజుల్లో పార్టీని గెలిపిస్తాయని గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయాలంటే దృఢమైన నాయకత్వం అవసరమని, ఆ దిశగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వమే సరైనదని మాజీ మంత్రి డా. సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. శింగణమల నియోజకవర్గంలో పదవి విరమణ చేసిన వైఎస్సార్సీపీ సర్పంచ్‌లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డా. సాకే శైలజానాథ్ సర్పంచ్‌లను శాలువాలు, పుష్పగుచ్చాలతో సత్కరించి వారి సేవలను డాక్టర్ శైలజనాథ్ కొనియాడారు. ఈ కార్యక్రమములో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గువ్వల శ్రీకాంత్ రెడ్డి నార్పల సత్యనారాయణ రెడ్డి శ్రీకాంత్ రెడ్డితదితరులు పాల్గొన్నారు

# ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో

## గొట్లూరులో జలధార-నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమం!




**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 6:** ఆరోజు ప్రధానిగా ఉన్న వాజ్ పెయ్ నదుల అనుసంధానం చేయాలని కలలు కన్నారని.. దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు సాధ్యం చేసి చూపించారని.. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార-నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ధర్మవరం రూరల్ మండలం గొట్లూరు గ్రామంలో ఈ కార్యక్రమం వందల మంది రైతులు మధ్య ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘాల సభ్యులు, టిడిపి నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చెరువు వద్ద వంద రోజుల నీటి ప్రణాళిక పై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఎక్కడో శ్రీశైలంలో ఉన్న కృష్ణా జలాలు ముదిగుబ్బ వరకు వస్తున్నాయంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషి అన్నారు. ఆరోజు ప్రధానిగా ఉన్న అటల్ బిహారీ వాజ్ పెయ్ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నదులన్నీ అనుసంధానం చేస్తే దేశంలో సాగునీటి సమస్యకు పరిష్కారం చూపించవచ్చని ఆలోచించారన్నారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నదులు అనుసంధానాన్ని చేశారన్నారు. పోలవరం దగ్గర పట్టిసీమ కట్టి డెల్టా ప్రాంతానికి గోదావరి జలాలను అందించారన్నారు. దీని ద్వారా కృష్ణాజలాల్ని సంపూర్ణంగా మనం వాడుకునే అవకాశం కల్పించారన్నారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన ఇలాంటి కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు. కృష్ణా జలాలు మన ప్రాంతానికి రావడానికి కోట్ల రూపాయల ఖర్చు చేస్తున్నారన్నారు. బిస్లరీ వాటర్ కంటే ఎక్కువగా ఇందుకు ఖర్చవుతోందన్నారు. కాబట్టి ఈ నీటిని జాగ్రత్తగా వినియోగించుకునే విధంగా చూడాలని సూచించారు. వర్షపు నీరు కూడా అంతకంటే విలువైనదని.. ప్రతి నీటి బొట్టును భూమిలో ఇంకే విధంగా మనం చర్యలు తీసుకోవాలన్నారు. ఒక చెరువుకు నీరు రావాలంటే దానికి ఉన్న మార్గాలను అన్వేషించి మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. వంకలు, వాగులు, చెరువులను అనుసంధానం చేసుకుంటే నీటి నష్టం ఉండదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని ముందుకు నడవాలన్నారు. ఎక్కడికక్కడ నీటిని నిలుపుకోవడానికి వర్షపు నీటిని నిలుపుకోవడానికి మనం పనులు చేపట్టాలన్నారు. రానున్న పది రోజుల్లో చెరువుల అభివృద్ధికి ఏం చేయాలన్నది ప్రణాళిక రచించాలని.. ఆ తర్వాత 90 రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలన్నారు. మొత్తం వంద రోజుల ప్రణాళికతో వచ్చే వర్షాకాలం నాటికి మంచి ఫలితాలు ఉండే విధంగా చూసుకుందామని.. శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాలతో పాటు ప్రజలంతా భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు...ఈ కార్యక్రమం లో మహేష్ చౌదరి కమతం కాటమయ్య, పరిసె సుధాకర్, గొట్లూరు శ్రీ నివాసులు,రూరల్ టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

# కనుముక్కలలో జలధార-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమం ప్రారంభం




- గాలి, ఎండ లెక్కచేయకుండా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్న సునీత
- వెల్దుర్తి-యర్రోనిపల్లి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 6:** కరవు జిల్లా అయిన మన ప్రాంతంలో నీరు బంగారం కన్నా విలువైందని.. దానిని ఒడిసి పట్టుకుందామని రైతులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలధార - నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని ఆమె నియోజకవర్గంలో ప్రారంభించారు. చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల గ్రామంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. చెరువు వద్ద రైతులు, సాగునీటి సంఘాలతో సమావేశమై.. ఎలాంటి చర్యలు చేపట్టాలన్నది చర్చించారు. చెరువుకు నీరు తీసుకుని రావడం దగ్గర నుంచి ఎలా వినియోగించుకోవాలన్న దానిపై 100రోజుల ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సునీత సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో నీటి చెట్టు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రామగిరి మండలం కుంటిమద్దిలో ప్రారంభించారని.. ఇప్పుడు అలాంటి కార్యక్రమాన్నే యాడికిలో ప్రారంభించారన్నారు. జిల్లా పట్ల, ఇక్కడి రైతుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. రైతుల కోసం రాష్ట్రంలో వ్యవసాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎండ, గాలి, వానను సైతం లెక్క చేయకుండా ఇలాంటి పర్యటనలు చేస్తున్నారన్నారు. ఇదేదో హడావుడిగా ప్రారంభించి వెళ్లిపోయేది కాదని.. ప్రతి రోజు మనం బాధ్యత తీసుకుని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. హంద్రీనీవా ద్వారా శ్రీశైలం నుంచి ఇక్కడికి వరకు నీరు వస్తోందంటే కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షం వచ్చినప్పుడు నీటిని నిలుపుకుని భూమిలో భద్రంగా దాచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువులను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి... నీరు వచ్చే మార్గాలను ఎలా విస్తృతం చేసుకోవాలి.. పూడిక తీత వంటి చర్యలు ఎలా చేయాలన్నది సాగు నీటి సంఘాలు చూడాలన్నారు. వారంతా రైతులతో చర్చించి వారి భాగస్వామ్యంతో ప్రణాళికలు చేయాలన్నారు. సరైన ప్రణాళికతో ప్రభుత్వానికి నివేదిక పంపితే కచ్చితంగా నిధులు వస్తాయన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 70లక్షలకు పైగా నిధులు వచ్చాయన్నారు. ముష్టికోవెల చెరువుకు 75లక్షలు, కనుముక్కల చెరువుకు 27లక్షల రూపాయలతో పనులు చేపట్టినట్టు వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని ముందుకు నడిపించాలని సూచించారు.

**ఏళ్ల నాటి రోడ్డు సమస్యకు పరిష్కారం..**

**రూ.3.43కోట్లతో రోడ్డు నిర్మాణం**


చెన్నేకొత్తపల్లి మండలంలో గత కొన్నేళ్లుగా ప్రజలకు నరకయాతనగా మారిన వెల్దుర్తి-యర్రోనిపల్లి రోడ్డు సమస్యకు ఎమ్మెల్యే పరిటాల సునీత పరిష్కారం చూపించారు. రూ.3.43కోట్లతో నిర్మించిన ఈ రోడ్డును ఆమె సోమవారం సాయంత్రం ప్రారంభించారు. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం మండల టీడీపీ నాయకులు, స్థానిక ప్రజల మధ్య పండుగ వాతావరణంలో సాగింది. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ వెల్దుర్తి నుంచి బ్రాహ్మణపల్లి మార్గంలో రోడ్డు కంకర తేలి కనీసం ద్విచక్రవాహనం వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. అడుగడుగునా గుంతలతో ప్రజలు నరకం చూశారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు గురించి ఏమాత్రం పట్టించుకోలేదని ఆమె విమర్శలు చేశారు. ఎన్నికల ముందు ఈ విషయాన్ని తాను కూడా ప్రత్యక్షంగా చూశానన్నారు. ఈ రోడ్డు నిర్మిస్తానని ఆ రోజే హామీ ఇచ్చానని... ఇచ్చిన మాట ప్రకారం నిధులు తీసుకొచ్చి పూర్తి చేశామన్నారు. 8 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మించి.. 11 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చూపించామన్నారు. రోడ్డు ప్రారంభం కావడం పై స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ, గతంలో ఈ రోడ్డుపై వెల్దుర్తి వరకు ప్రయాణించాలంటే 30 నిమిషాల సమయం పట్టేదని ప్రస్తుతం ఆరు నిమిషాల్లో ఇక్కడికి చేరుకుంటున్నామని ఎమ్మెల్యే సునీతకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు...

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శంకుస్థాపనలు,

- ప్రారంభోత్సవాలతో సుడిగాలి పర్యటనలు,



కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురంలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



తర్తూరు శ్రీ రంగనాథ్ స్వామిని దర్శనం చేసుకుంటున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**అంకుశం న్యూస్ నంద్యాల ఏప్రిల్ 6:** నంద్యాల పార్లమెంట్ పరిధిలోని నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాలలోని జూపాడుబంగ్లా, కొత్తపల్లి, కల్లూరు, పాములపాడు మండలాలలో ఎంపీ నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్ల ప్రారంభోత్సవంలు, శంఖుస్థాపణలు, కల్లూరు మండలంలో పేద ముస్లిం రెండు వేల మంది మహిళలకు చీరెలు పంపిణీ, రాయలసీమలోని జాతరలలో ప్రముఖమైన తర్తూరు శ్రీ రంగనాథస్వామి తిరునాళ్లలో పాల్గొని స్వామి వార్ల దర్శనం, తర్తూరు గ్రామంలో సిమెంట్ రోడ్డు ప్రారంభం సోమవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి విస్తృతంగా, సుడిగాలి పర్యటన చేశారు.

జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామంలో వంక నుంచి పాత రంగస్వామి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం, బైరెడ్డి బిల్డింగ్ లలో రెండు సిమెంట్ రోడ్లుల నిర్మాణాలకు ఎన్ ఆర్ జి ఎస్ నిధులు రూ. 55 లక్షలతో ఖర్చు చేసి పూర్తి చేయడంతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. పాఠశాల కు వెళ్లి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ భవనం శిధిలావస్థాకు చేరుకుందని చెప్పడంతో అక్కడి నుంచే నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి కి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఫోన్ చేసి తర్తూరు స్కూల్ సమస్య పరిష్కారం చేయాలన్నారు. గ్రామం లోని రెండు అంగన్వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. తర్తూరు శ్రీ రంగనాథ్ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి వారికి అర్చన, విశేష పూజలు చేయించి ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదం అందించి శాలువతో సన్మానం చేసి ఆశీర్వచనం చేశారు. తర్తూరు టీడీపీ నాయకులు పి. నాగిరెడ్డి, శివ కృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ జడ్పీటీసీ నాగేశ్వరావు, బంగారు వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.

జూపాడుబంగ్లా మండలం భాస్కాపురం గ్రామంలోని బి సి కాలనీలో రూ. 25 లక్షలు, ఎస్సీ కాలనీలో రూ. 25 లక్షలు మొత్తం రూ. 50 లక్షల ఎన్ ఆర్ జి ఎస్ నిధులతో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మాణం పూర్తి చేసి సోమవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు గోవింద్ యాదవ్, మాధవి, పరమేష్, నరసింహ, శివమ్మ, అనిల్, శ్రీరాములు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఘన స్వాగతం పలికారు.

## ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్




**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఏప్రిల్ 06:** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ లి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, డిఆర్వో విజయసారధి,ఆర్డీఓ సువర్ణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ.... పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నేడు మొత్తం 213 అర్జీలు రాగా వాటిపై తగు చర్య తీసుకొని పరిష్కరించు నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేయడం జరిగింది.

## డిగ్రీ విద్యార్థిని కోటి మాలశ్రీ కి ఘనంగా నివాళులు!



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 6:** ఏడాది క్రితం మృతి చెందిన ధర్మవరం లోనికోట విద్యార్థిని కోటి మాలశ్రీ కి సోమవారం పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థిని కోటి మాలాశ్రీ జ్ఞాపకార్థం గొట్లూరు అనాధ ఆశ్రమం లో వృద్దులకు, ఆనాధలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో కోటి మద్దికెరప్ప, శ్రీ మతి కోటి గిరిజమ్మ, దుర్గా ప్రసాద్, పామాల మహేష్, శ్రీ మతి పామాల శ్రీ లేఖ, పామాల దుర్గా ప్రసాద్, నవ్యశ్రీ తదితరులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.